ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
మంగళవారం 19 మార్చి 2024









సిద్దిపేట రూరల్ మండలం ఇరుకోడులోని మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రం వద్ద పాపతో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ భాగ్యలక్ష్మి

ఇందిరానగర్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్

బోర్డుపై నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు, సిద్దిపేట ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కాలికి గాయం కావడంతో తండ్రి, స్నేహితుల సహాయంతో చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థి

పది పరీక్షలు షురూ

- తొలిరోజు ప్రశాంతం
- 99.92 శాతం హాజరు నమోదు
- 11 మంది విద్యార్థులు గైర్హాజరు

పరీక్షా సమయం దగ్గర పడుతుండడంతో పరుగెడుతున్న విద్యార్థిని

సిద్దిపేట క్రైం, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు సోమవారం ప్రథమ భాష తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఐదు నిమిషాల గ్రేస్ సమయం వరకు అనుమతిస్తామని ముందే ప్రకటించగా, విద్యార్థులు ఆ అవకాశం తీసుకోకుండా ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. ఎనిమిది గంటల నుంచే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది. మొదటి రోజు కావడంతో విద్యార్థుల్లో ఉత్కంఠ, భయం కనిపించింది. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా కేంద్రాల వద్దకు తరలివచ్చారు. విద్యార్థులను తనిఖీలు చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నాపత్రాలను రిలీజ్ చేశారు. జిల్లాలో 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 13,988 మంది విద్యార్థులకు 13,977 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. 99.92 శాతం హాజరు నమోదైంది. సిద్దిపేట పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ (మల్టీ పర్పస్), ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఎం.మను చౌదరి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లను కలెక్టర్ ఆదేశించారు.



సిద్దిపేటలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

చెక్‌పోస్టుల వివరాలు

- సిరిసిల్ల జిల్లా సరిహద్దులో జక్కాపూర్
- కరీంనగర్ జిల్లా సరిహద్దులో దేవక్కపల్లి
- మేడ్చల్ జిల్లా సరిహద్దులో వంటిమామిడి
- మెదక్ జిల్లా సరిహద్దులో భూంపల్లి క్రాస్‌రోడ్
- యాదాద్రి భువనగిరి జిల్లా సరిహద్దులో జగదేవ్‌పూర్
- మెదక్ జిల్లా సరిహద్దులో బేగంపేట
- హనుమకొండ జిల్లా సరిహద్దులో జిల్లెల్లగడ్డ
- జనగామ జిల్లా సరిహద్దులో ముస్త్యాల

నలువైపులా నిఘా

- జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు
- పోలీసులు, అధికారులతో ప్రత్యేక బృందాలు
- రూ.50వేలకు మించితే నగదు సీజ్
- ఇప్పటికే సీఐఎస్‌ఎఫ్ బలగాల రాక

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 18 : లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మరుక్షణమే అధికారులు పక్కాగా కోడ్ అమలు దిశగా అడుగులు వేస్తున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే డబ్బు పంపిణీ, మద్యం రవాణాను అరికట్టడానికి జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పోలీసులు, అధికారులతో సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారికి చెక్‌పోస్టుల వద్ద, గ్రామాల్లో తనిఖీల బాధ్యతలను అప్పగించారు. 16వ తేదీ నుంచి ఈ చెక్‌పోస్టుల నిర్వహణ కొనసాగుతున్నది. ఎక్కడికక్కడ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి.

నగదుపై ఫోకస్

జిల్లా చుట్టూ ఉన్న కరీంనగర్, హనుమకొండ, జనగామ, మెదక్, మేడ్చల్, భువనగిరి జిల్లాల సరిహద్దుల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆ జిల్లాల నుంచి ఈ జిల్లాకు వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల దృష్ట్యా నగదు, మద్యం, ఇతర వస్తువులపై నిఘా పెట్టారు. పోలింగ్ పూర్తయ్యేదాకా ఈ చెక్‌పోస్టులు కొనసాగుతాయి. ఇక్కడ ఒక ఇన్‌చార్జితోపాటు నలుగురు సిబ్బంది 24 గంటల పాటు ఉండేలా చర్యలు తీసుకున్నారు. చెక్‌పోస్టు బృందాలు తనిఖీ చేసే ప్రక్రియను వీడియోల్లో చిత్రీకరిస్తున్నారు. ప్రస్తుతం కార్లపైనే ఎక్కువ ఫోకస్ పెడుతున్నారు. లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తున్నారు. స్పష్టమైన ఆధారాలు చూపిస్తేనే డబ్బు తిరిగి ఇస్తున్నారు. ఇప్పటివరకైతే అక్రమ నగదు పట్టుబడలేదు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

బార్డర్ చెక్‌పోస్టులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు, విలేజ్ సర్వేలెన్స్ బృందాలు సహా మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలను రంగంలోకి దింపనున్నారు. ఇప్పటివరకైతే మండలానికి ఒక మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) పర్యవేక్షక బృందం చొప్పున 26 ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేశారు. 11 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను సిద్ధం చేశారు. పోలీసులతోపాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులను ఈ బృందాల్లో భాగస్వాములను చేశారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలపై మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ఇక అప్పటికప్పుడు వచ్చిన సమాచారం ఆధారంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వెనువెంటనే రంగంలోకి దిగేలా సిద్ధం చేశారు. నగదు, వస్తువులు పట్టుబడితే ఆరా తీయడానికి ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు ఉండనే ఉంటాయి. చెక్‌పోస్టుల్లో ప్రధానంగా స్థానిక పోలీసులకు బదులుగా సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలతో మోహరించారు. ప్రస్తుతం జిల్లాలో 90 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ప్రజావాణి వినరా?

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో నిలిచిన ఫిర్యాదుల స్వీకరణ

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విరామం
- జూన్ 6 వరకు ఉండదని ప్రకటన
- అప్పటి వరకు ప్రజా సమస్యలు గాలికేనా?
- మెదక్ జిల్లాలో కొనసాగింపు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి18: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'కి బ్రేక్ పడింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో నిలిపేస్తున్నామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్ 6 వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉండదని వారు తెలిపారు. ఎన్నికల పేరిట దాదాపు రెండున్నర నెలల వరకు ప్రజావాణి నిలిపేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికే ఇంకో నెల సమయం ఉండడడంతో.. కనీసం అప్పటి వరకు ప్రజా సమస్యలు వింటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచే కోడ్ అమలులోకి వచ్చినా ఎన్నికల సంఘం నిబంధనలమేరకు ఇప్పటికే జరుగుతున్న (ఆన్‌గోయింగ్) ప్రభుత్వ కార్యక్రమాలన్నీ యథావిధిగా కొనసాగించే అవకాశం ఉన్నది. ఈమేరకు ప్రజల సమస్యల పరిష్కారం 'ఆన్‌గోయింగ్' పరిధిలోకి రావా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలెవరూ రాజకీయ పార్టీలకు చెందరని, ఓటు మాత్రమే వినియోగించుకుంటారని వారు గుర్తు చేస్తున్నారు. అలాంటి వారు ఎదుర్కునే సమస్యలు కనీసం చెప్పుకోవడానికైనా అధికారులు అనుమతించకపోతే ఎలా అని వారు అడుగుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ మొదలయ్యే వచ్చే నెల 18 నుంచి ప్రజావాణిని నిలిపివేస్తే అర్థముండేదని వారు అంటున్నారు. అప్పటి నుంచి అధికారులందరూ ఎన్నికల నిర్వహణలో బిజీగా ఉండడంతో ప్రజావాణిని నిర్వహించడం, ప్రజల సమస్యలు పరిష్కరించడం సాధ్యమయ్యే అవకాశం ఉండదు. కానీ నోటిఫికేషన్‌కు నెల రోజుల ముందు నుంచే ప్రజావాణిని నిలిపివేయడంతో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొనే మంచినీరు, డ్రైనేజీ నిర్వహణలో ఇబ్బందులు, కరెంట్ సరఫరాలో లోపం, పంటలకు నీరందించడం, పింఛన్లు సక్రమంగా అందకపోవడం వంటి సమస్యలను గాలికి వదిలేయాల్సిందేనా అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, మెదక్ జిల్లాలో మాత్రం సోమవారం ప్రజావాణిని యథావిధిగా నిర్వహించడం విశేషం.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'లో అందజేసేందుకు తీసుకువచ్చిన అర్జీలకు చూపుతున్న బాధితులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :
మంగళవారం సా : 6.32 గం.

సహర్ :
బుధవారం ఉ: 4.59 గం.

వీళ్లకు ముసుగులు ఏమిటీ?

- స్వామి వివేకానంద, చాకలి ఐలమ్మలు నేతలా?

7

స్నేహితుడిని బిల్డింగ్‌పై నుంచి తోసేసి హత్య

- సిగరెట్ కోసం జరిగిన గొడవతో విషాదం
- సంగారెడ్డి జిల్లా ఇంద్రకరణ్‌లో ఘటన

గజ్వేల్ డిగ్రీ కళాశాలలో ఇక కో-ఎడ్యుకేషన్

- ఆమోదించిన ఉన్నత విద్యాశాఖ

గజ్వేల్, మార్చి 18: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో గల ఎడ్యుకేషన్‌హబ్‌లోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ఇకపై కో-ఎడ్యుకేషన్‌గా మారబోతుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో బాలుర డిగ్రీ కళాశాలగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం కళాశాలలో సీట్లను తగ్గించింది. దీంతో గజ్వేల్ ఏరియా పరిధిలోని విద్యార్థులకు నష్ట వాటిల్లింది. ఈ క్రమంలో కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ, కళాశాల అధ్యాపకులు బాలుర డిగ్రీ కళాశాలను కో-ఎడ్యుకేషన్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

సీట్ల సంఖ్య పెరిగే అవకాశం

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో ఒక్కో గ్రూపులో 120 సీట్లు ఉండగా ఇటీవల అడ్మిషన్ల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో 60 సీట్లను కోత విధించింది. వచ్చే విద్యాసంవత్సరం దోస్త్ నోటిఫికేషన్‌లో కో-ఎడ్యుకేషన్‌తో పాటు 120 సీట్లను మంజూరు చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. కో ఎడ్యుకేషన్ మంజూరుతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.



గజ్వేల్‌లోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల

ఎన్నికల నిబంధనలను పాటించాలి

- కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 18: అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను పాటించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో వివిధ అనుమతులకు సంబంధించి సువిధ యాప్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు, నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోస్టర్లు, పాంప్లెంట్లను ముద్రించేటప్పుడు వాటి మీద ప్రింటింగ్ ప్రెస్ అడ్రస్ కచ్చితంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై నిఘా పెంచేందుకు కలెక్టర్ కార్యాలయంలో ఒక ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. సీ- విజిల్, 1950 టోల్ ఫ్రీ నంబర్, నేషనల్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ వింగ్ తదితర విభాగాలు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

లైసెన్స్ తుపాకులను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలి : సీపీ

సిద్దిపేట క్రైం, మార్చి 18 : పార్లమెంట్ సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ ఉన్న తుపాకులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 25 లోపు డిపాజిట్ చేయాలని సీపీ డాక్టర్ బి.అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత తిరిగి నిబంధనల ప్రకారం తీసుకొని వెళ్లవచ్చని పేర్కొన్నారు. తుపాకులు డిపాజిట్ చేయని వారిపై కేంద్ర, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ప్రజాప్రతినిధులు తప్పకుండా పాటించాలని సూచించారు.జిల్లాలో బార్డర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్టు, 24 గంటల పాటు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

వడగండ్ల వాన


- దెబ్బతిన్న వరి.. రాలిన మామిడికాయలు
- దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలల్లో రైతులకు నష్టం



దుబ్బాక/మిరుదొడ్డి/అక్బర్‌పేట-భూంపల్లి, మార్చి 18 : జిల్లాలో సోమవారం రాత్రి పలుచోట్ల వడగండ్ల వర్షం కురిసింది. దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలల్లోని వివిధ గ్రామాలల్లో రాళ్లవాన కురియడంతో కోతకు వచ్చిన వరి రాలిపోయింది. దుబ్బాక, చెల్లాపూర్, మల్లాయపల్లి, అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఎనగుర్తి, బొప్పాపూర్, చిన్ననిజాంపేట, రామేశ్వరంపల్లి, పోతరెడ్డిపేట, తాళ్లపల్లి, నగరం గ్రామాల్లో వరి పంట దెబ్బతిన్నది. మామిడి తోటలు ధ్వంసమయ్యాయి, మామిడి కాయలు పిందె దశలోనే రాలిపోయాయి. మిరుదొడ్డి, దుబ్బాక మండలంలోని పలు గ్రామాలల్లో చెట్లు నేలకూలాయి. వడగండ్ల వానతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పంటనష్టంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. వివిధ గ్రామాల్లోని పంట నష్టం అంచనాను మంగళవారం అధికారులు సేకరించాలని ఆయన ఆదేశించారు.



దుబ్బాకలో కురిసిన రాళ్ల వాన



గుమ్మడిదలలో మహిళ అదృశ్యం


మాధవి(ఫైల్)

గుమ్మడిదల, మార్చి 18: ఈ నెల 16న ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని వస్తానని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా ఆమె భర్త సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం.. గుమ్మడిదల గ్రామానికి చెందిన పూడూరి మాధవి అనే మహిళ ఈ నెల 16 వ తేదీన గుమ్మడిదల గ్రామం నుంచి పట్టణ ప్రాంతంలోని సూరారంలో ఉన్న మల్లారెడ్డి ఆసుపత్రికి వెళ్లి వైద్యం పరీక్షలు చేయించుకువస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి, ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో భర్త పూడురి నర్సింహులు చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. సోమవారం భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అర్ధరాత్రి చెక్‌పోస్టు తనిఖీ

● మట్టి తరలిస్తున్న 19 టిప్పర్లను పట్టుకున్న ఎస్పీ


ఎస్పీ తనిఖీ సమయంలో పట్టుబడ్డ టిప్పర్లు

నర్సాపూర్, మార్చి 18: పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై నర్సాపూర్ సమీపంలో మల్లన్న గుడి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదివారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అదే సమయంలో కౌడిపల్లి మండలం నుంచి మట్టి లోడ్‌తో వస్తున్న టిప్పర్లలో ఆపి తనిఖీ చేశారు. ఈ మట్టి తరలింపు నిబంధనల మేరకు కొనసాగుతుందా.. అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయమై విచారణ చేయడానికి ఆ సమయంలో వచ్చిన 19 టిప్పర్లను మల్లన్నగుడి వద్దనే నిలిపివేయించారు. మట్టి తరలింపుపై విచారణ చేసి, అనుమతులు లేకుంటే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుఅధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక పోలీసు అధికారులను పలుమార్లు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

అక్రమ మద్యంపై దండెత్తిన మహిళలు


హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

హత్నూర, మార్చి 18: పచ్చని సంసారాలలో చిచ్చు పెడుతున్న అక్రమ మద్యం వ్యాపారాన్ని నిలిపివేయాలని కోరుతూ హత్నూర మండలంలోని పన్యాల, బడంపేట గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. గ్రామాల్లోని కిరాణా దుకాణాల్లో సైతం నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేయడం వల్ల యువత పెడదారి పడుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా చిన్న పెద్ద తేడా లేకుండా మద్యం సేవించడం వల్ల ఇళ్లల్లో తరుచూ గొడవలు తలెత్తి ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసైన ఎంతోమంది పురుషులు మహిళల మెడలో నుంచి పుస్తెలు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామంలో పూర్తి విచారణ చేసి కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలను నిషేధించాలి వారు కోరారు. కార్యక్రమంలో స్థానిక సత్యశోధన యువజన సంఘం బాధ్యులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

బావమరిది పెళ్లికి వచ్చి బావ మృతి

కౌడిపల్లి, మార్చి 18: బావ మరిది పెళ్లి కోసం వచ్చి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన బావ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన తలారి సురేష్ వివాహం నర్సాపూర్ మండలంలోని రాంచంద్రపూర్‌లో జరిగింది. పెళ్లికి పాపన్నపేట్ మండలంలోని కొంపల్లికి చెందిన వరుడి అక్క ముక్క లక్ష్మి, బావ చంద్రయ్య కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. రాత్రి వేళ కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్ళి వస్తానని చెప్పి వెళ్లిన చంద్రయ్య తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రాత్రిపూట చెరువు వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. సోమవారం మధ్యాహ్నం చెరువులో చంద్రయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విషం తాగి యువకుడి బలవన్మరణం


మహేష్ గౌడ్(ఫైల్)

మాసాయిపేట, మార్చి 18: జులాయిగా తిరగకుండా ఏదైనా పని చేసుకోవాలని తండ్రి మందలించడంతో ఓ యువకుడు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని కుప్పలపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్థుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాలగోని మహేష్‌గౌడ్ (23) జులాయిగా తిరుగుతుండటంతో తండ్రి నర్సాగౌడ్ ఏదైనా పని చేయాలని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన మహేష్‌గౌడ్ ఈ నెల 16న తన ఇంటి వద్ద విషం తాగాడు. హుటాహుటిన తూప్రాన్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై వెల్దుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు.

స్నేహితుడిని బిల్డింగ్‌పై నుంచి తోసేసి హత్య

● సిగరెట్ కోసం జరిగిన గొడవతో విషాదం


రోషన్ (ఫైల్)

కంది, మార్చి 18 : మద్యం మత్తులో సిగరెట్ కోసం గొడవపడి స్నేహితుడిని భవనం పైనుంచి తోసేసి హత్య చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఇంద్రకరణ్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన అశోక్‌కుమార్, అంకిత్, రోషన్‌లు ఇంద్రకరణ్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ గ్రామంలోని ఓ ఇంట్లో రెండో అంతస్తులోని పెంట్‌హౌస్‌లో అద్దెకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు మద్యం సేవించిన అంకిత్, రోషన్‌లు సిగరెట్ కోసం గొడవపడ్డారు. ఈ గొడవలో అంకిత్ రోషన్‌ను పెంట్‌హౌస్ పై నుంచి కిందకు తోసేశాడు. ఈ ఘటనలో రోషన్ తల పగిలి తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన అంకిత్ అక్కడి నుంచి పరారయ్యాడు. సోమవారం ఇంటి యజమాని కొత్తపల్లి కిష్టయ్య ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వీళ్లకు ముసుగులేమిటీ?

● స్వామి వివేకానంద, చాకలి ఐలమ్మలు నేతలా?


చాకలి ఐలమ్మ విగ్రహం


స్వామి వివేకానంద విగ్రహం

ఒకరు ఆధ్యాత్మిక వేత్త, మరొకరు భూమి కోసం.. భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి. అటువంటి వారి విగ్రహాలకు ఎన్నికల కోడ్ కారణంగా ముసుగులు వేయడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఎన్నికలలో ప్రభావితం చేసే రాజకీయాలతో సంబంధం ఉన్న నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం సహజం. అయితే జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో స్వామి వివేకానంద, చాకలి ఐలమ్మల విగ్రహాలకు ముసుగులు వేయడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. వీరిద్దరికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజకీయాలతో సంబంధం లేదన్నది జగమెరిగిన సత్యం. స్వామి వివేకానంద దేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్‌లలో యోగా, వేదాంత శాస్త్రాల గురించి తన ఉపన్యాసాల ద్వారా ప్రభావితం చేసిన మహనీయుడు. అందుకే ఆయన విగ్రహాన్ని సంగారెడ్డి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేశారు. ఇక తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి ఇచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ. అందుకే ఆమె విగ్రహాన్ని కలెక్టరేట్ సమీపంలో నెలకొల్పారు. ఇప్పుడు వీరిద్దరి విగ్రహాలకు ముసుగులేయడం ఏమిటో అధికారులకే తెలియాలి.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

● మెదక్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, ఎస్పీ బాలస్వామి

మెదక్, మార్చి 18: సాధారణ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని మెదక్ పార్లమెంట్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎస్పీ బాలస్వామితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వెలువడుతుందన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26న పరిశీలన, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని వివరించారు.

ఏప్రిల్ 15వరకూ ఓటరు నమోదు

మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్, అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు సరిచూసుకోవాలని, జాబితాలో పేరులేనివారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం 18,12,858 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకప్ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. రాజకీయపార్టీల నేతలకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లాలో బృందాలను, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రజలు 1950 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా, సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చునన్నారు. ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు, మద్యం సరఫరా జరగకుండా 24 గంటలపాటు గట్టి నిఘా ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. ఇందుకోసం జిల్లాలో అవసరమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు రూ. 50వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, ఒకవేళ డబ్బు పట్టుబడితే అందుకు సంబంధించిన సరైన పత్రాలను చూపించాల్సి ఉంటుందని సూచించారు.

నిబంధనలు పాటించాలి

మెదక్ అర్బన్, మార్చి18: ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి రూ.95 లక్షల వరకు ఖర్చు పరిమితి ఉందన్నారు. ఎన్నికల ప్రచార ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు 72 గంటల ముందస్తు దరఖాస్తు చేసుకొని సువిధ యాప్ ద్వారా అనుమతి పొందాలన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్, ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా: ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి18: పార్లమెంట్ ఎన్నికలకు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పోలీసు అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. అధికారులంతా ఎన్నికల నియమావళికి లోబడి పని చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేర చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్ల జాబితా సిద్ధం చేసుకొని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. అయుధ లైసెన్స్ కలిగిన వారు డిపాజిట్ చేయించాలన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంజీవన్‌రావుపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్‌కు
అవిశ్వాసం సెగ

● నోటీసు అందించిన పది మంది డైరెక్టర్లు


ఊర్మిళరాంరెడ్డి, చైర్‌పర్సన్

నారాయణఖేడ్, మార్చి 18: మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట ప్రాథమిక సహకార సంఘం(సీడెడ్)సొసైటీ చైర్‌పర్సన్‌కు అవిశ్వాసం సెగ తగిలింది. సంజీవన్‌రావుపేట ప్రాథమిక సహకార సంఘానికి నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో 13 మంది డైరెక్టర్లకు గాను 8 మంది బీఆర్ఎస్‌పార్టీకి చెందిన వారు, 5 మంది కాంగ్రెస్ పార్టీకిచెందిన వారు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. దీంతో అప్పట్లో బీఆర్ఎస్‌పార్టీకి చెందిన ఊర్మిళరాంరెడ్డి చైర్‌పర్సన్‌గా, రాములు వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్‌పార్టీ డైరెక్టర్ల మద్దతుతో ఎన్నికయ్యారు. కొద్ది రోజుల క్రితం వైస్ చైర్మన్‌రాములు, డైరెక్టర్లు బాలయ్య, దేవిసింగ్‌లు చనిపోయారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తోడు నారాయణఖేడ్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు సంజీవరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బుజ్జం కిషన్, సుశీల, బీఆర్ఎస్ డైరెక్టర్ శంకర్‌రావు, కిమ్యానాయక్ తదితరులు చైర్‌పర్సన్ ఊర్మిళరెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదపడం ప్రారంభించారు. వైస్ చైర్మన్, ఇరువురు డైరెక్టర్లు చనిపోవడంతో వారి స్థానంలో ముగ్గురిని కోఆప్షన్ సభ్యులుగా దినాకర్‌రావు, సుందరమ్మ, సతీష్‌లను ఎన్నుకున్నారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన శంకర్‌రావు, రుక్మమ్మ, సంజీవరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, దినాకర్‌రావు, సుందరమ్మ, కిమ్యానాయక్, సుశీల, కిషన్, తదితరులు కలిసి అవిశ్వాసం నోటీసును ఇటీవల జిల్లా సహకార అధికారికి, కలెక్టర్‌కు అందించారు. దీంతో ఏప్రిల్ 2న డైరెక్టర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాసంపై సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి డైరెక్టర్లకు సోమవారం నోటీసులు అందించారు. ఏదిఏమైనా పీఏసీఎస్ సంజీవన్‌రావుపేట చైర్మన్ ఊర్మిళరెడ్డికి అవిశ్వాసం సెగ తగిలిందని చెప్పవచ్చు.

జాతీయ సమైఖ్యతా శిబిరానికి 'తారా' విద్యార్థిని

సంగారెడ్డి అర్బన్, మార్చి 18 : జాతీయ సమైఖ్యతా శిబిరానికి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థిని ఎం.సింధు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హరియాణాలోని ఫరహాబాదులో ఈ నెల 12నుంచి 18 వ తేదీ వరకు జరిగిన జాతీయ సమైఖ్యత శిబిరంలో సింధు పాల్గొని, సాంస్కృతిక కార్యక్రమాలలో జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తీసుకువచ్చిందని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. తమ విద్యార్థిని జాతీయస్థాయిలో రాణించడం సంతోషంగా ఉందని ఆమెను అభినందించారు.

మామిడి తోటలను పరిశీలించిన ఉద్యానవనాధికారి


మామిడి పంట నష్టాన్ని పరిశీలిస్తున్న మండల ఉద్యానవనాధికారి

నిజాంపేట, మార్చి 18: ఇటీవల కురిసిన అకాలవర్షం, ఈదురు గాలులకు నష్టపోయిన మామిడి తోటలను మండల ఉద్యానవనాధికారి సంతోష్‌కుమార్ పరిశీలించారు. సోమవారం మండల పరిధిలోని నస్కల్, చల్మెడ నగరం గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించి, వాటిల్లిన నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఉద్యానవనాధికారి మాట్లాడుతూ మండలంలో మొత్తం 18 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన రైతుల వివరాలను, నష్టం అంచనాను సేకరించామని తెలిపారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు అందజేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందే విధంగా కృషి చేస్తామని చెప్పారు.

నకిలీ క్రిమిసంహారక మందులతో పంట నష్టం

● పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారి, కంపెనీ ప్రతినిధులు


రంగు మారిన వరి పంట, బాధిత రైతుతో మాట్లాడుతున్న అధికారులు, కంపెనీ ప్రతినిధులు

కొండపాక, మార్చి 18: వరి పంటకు పురుగుల మందు స్ప్రే చేస్తే పంట అంతా చెడిపోయిందని కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన రైతు సోమవారం ఆందోళనకు దిగాడు. దుద్దెడ గ్రామానికి చెందిన చిలుమల శ్రీనివాస్ అనే రైతు తన రెండెకరాల వరి పంటకు తెగులు సోకడంతో వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద గల పురుగుల మందు దుకాణం నుంచి క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసి పిచికారి చేశాడు. తెగులు నివారణ ఏమో గాని పంట మొత్తం ఎర్రగా మారి పూర్తిగా నష్టపోయానని ఆందోళనకు దిగాడు. దాంతో దుకాణ యజమాని సంబంధిత కంపెనీ వారిని రప్పించి రైతుతో మాట్లాడించారు. ఎర్రగా మారిన పంటలను వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శినితో పాటు కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. తమ కంపెనీ మందు స్ప్రే చేస్తే నష్టం కాలేదని, ఈ మందులో వేరే కంపెనీ గడ్డి మందు కలిపి స్ప్రే చేయడం వల్ల జరిగిందని వారు వివరించారు. అయినప్పటికీ శాంపిల్స్ తీసుకువెళ్లి నిర్ధారణ చేస్తామని, తమ కంపెనీ మందు వల్ల నష్టం జరిగితే పరిహారం అందిస్తామని కంపెనీ నిర్వాహకులు తెలపడంతో బాధిత రైతు ఆందోళన విరమించారు.

ఎంఈవో చొరవతో 'పది' పరీక్షలకు హాజరైన విద్యార్థిని


విద్యార్థినికి రూపకు హాల్ టిక్కెట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

పుల్‌కల్, మార్చి 18: మండల విద్యా శాఖాధికారి దండు అంజయ్య చొరవతో ఓ విద్యార్థిని పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరైంది. మండలంలోని మంతూరు గ్రామానికి చెందిన రూప పుల్కల్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా, రూప 17వ తేదీ వరకు హాల్ టికెట్ తీసుకోలేదు. అప్పటికే రూప స్వగ్రామమైన మంతూరుకు వెళ్లి తల్లిదండ్రుల వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్తున్నది. పరీక్షలు సమీపించిన తరుణంలో పాఠశాలలో రూప మాత్రమే హాల్ టికెట్ తీసుకోలేదన్న విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు ఎంఈవో దండు అంజయ్య దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఆదివారం మంతూరు గ్రామానికి వెళ్లి విద్యార్థిని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ పరీక్షలకు హాజరయ్యేందుకు నిరాకరించడంతో విద్యా హక్కు చట్టం గురించి వివరిస్తూ తల్లిదండ్రులపై పోలీసు కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఎట్టకేలకు అంగీకరించిన తల్లిదండ్రులు కస్తూర్బా గాంధీ పాఠశాలకు ఆదివారం సాయంత్రం రావడంతో హాల్ టికెట్‌ను అందజేశారు. దీంతో రూప సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు హాజరైంది. ఎంఈవో దండు అంజయ్య చూపిన చొరవను పలువురు అభినందించారు. ఈ విషయమై ఎంఈవో మాట్లాడుతూ ఓ చిన్న ప్రయత్నం బాలిక జీవితాన్నే మార్చవచ్చని ఆకాంక్షించారు.

పోలీసుల తనిఖీలో రూ.2.80 లక్షలు పట్టివేత


డబ్బును స్వాధీనం చేసుకుంటున్నఎస్ఐ

కల్హేర్, మార్చి 18: మండల పరిధిలోని కల్హేర్, మాసాన్‌పల్లి గ్రామాల మధ్య పోలీసుల తనిఖీలో రూ.2.80 నగదు పట్టుబడినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తెలిపారు. సోమవారం సాయంత్రం తమ సిబ్బందితో కల్హేర్, మాసాన్‌పల్లి రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన చీనూరి కుబేర్‌కుమార్ అనే వ్యక్తి సరైన పత్రాలు లేకుండా తన ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.2.80లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును సంగారెడ్డిలోని గ్రీవెన్స్ కమిటీలో డిపాజిట్ చేశామన్నారు. సరైన పత్రాలు సమర్పిస్తే నగదును అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎవరూ రూ. 50 వేలకు మించి నగదును తరలించరాదని, తప్పనిసరైతే సరైన ఆధారాలు చూపాలని సూచించారు.

ఓఆర్ఆర్‌పై కారు ఢీకొని మరో కారు బోల్తా

శంషాబాద్ రూరల్, మార్చి 18: శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ కారు మరో కారును ఢీకొన్న ఘటనలో ముందు వెళ్తున్న కారు బోల్తా పడింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా బీరంగూడకు చెందిన శివరాత్రి వెంకన్న తన బ్రిజా (టీఎస్14 ఈఎక్స్8762) కారులో సూర్యాపేట నుంచి పటాన్‌చెరుకు బయలుదేరాడు. ఓఆర్ఆర్‌పై మార్గమధ్యలో పెద్దగోల్కొండ వద్దకు చేరుకోగానే వెనక నుంచి వచ్చిన ఎస్‌క్రాస్ (ఏపీ 39 కేఈ 2033) కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ముందున్న వెంకన్న కారు బోల్తా కొట్టింది. అయితే కార్లలో ఉన్న ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డ్రైవర్ సందీప్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ అవినీతి

● సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు, ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు సీతారాములు

చేర్యాల, మార్చి 18: ఎలక్టోరల్ బాండ్ల పేరిట బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల నుంచి అక్రమంగా పోగుసుకుందని, ఆ అవినీతి సొమ్ము వెదజల్లి మళ్లీ అధికారంలోకి రావాలని కుయుక్తులు పన్నుతుందని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు విమర్శించారు. సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని వాసవీగార్డెన్స్‌లో నిర్వహించిన చేర్యాల, కొమురవెల్లి, ధూళిమిట్ట, మద్దూరు మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేది మరోటిలా ఉందన్నారు. ఎలక్టోరల్‌బాండ్ల రూపంలో వచ్చిన నిధులను వెల్లడించకుండా రాజ్యాంగబద్ధ వ్యవస్థలను నిర్వీర్యం చేసి కేంద్రం గుప్పిట్లో పెట్టుకుని ప్రజావ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థతో కూడుకున్న దేశంలో కులం, మతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలు చెల్లవన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం నిధులను ఇవ్వకుండా రాష్ట్రాల హక్కులను హరించడమే కాకుండా ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేయిస్తుందని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను వంచించిందన్నారు. బీజేపీ పాలనలో ఆకలిచావులు పెరిగిపోయాయన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో సీపీఎం పోటీ చేస్తుందని, సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు, జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు నక్కల యాదవరెడ్డి, రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ప్రశాంతంగా పది పరీక్షలు

జిల్లాలో సోమవారం పది పరీక్షలు మొదటిరోజు ప్రశాతంగా ముగిశాయి. విద్యార్థుల పరీక్ష సమయానికి కొంచెం ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యాశాఖ అధికారులు పలు కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలుపరిచారు.

కొమురవెల్లి, మార్చి 18 : మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్‌లో జరిగిన పదిపరీక్షలకు 100 శాతం విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని కొమురవెల్లి ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 168 మంది విద్యార్థులకు గాను 165 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** మండలంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. దుబ్బాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240, జడ్పీజీహెచ్ఎస్‌లో 218, లచ్చపేట జడ్పీహెచ్ఎస్‌లో 106, మోడల్‌స్కూల్‌లో 249 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మిరుదొడ్డి మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిరుదొడ్డి జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 234, అల్వాల గురుకుల పాఠశాలలో 135 మంది విద్యార్థులు పరీక్షలను రాశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని పోతరెడ్డిపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 107, భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 99 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

● **తొగుట:** మండలంలో పదోతరగతి పరీక్షల కోసం రెండు పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 286 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో సత్తు యాదవరెడ్డి తెలిపారు.

● **నారాయణరావుపేట:** మండలంలో గుర్రాగొంది, నారాయణరావుపేట పరీక్ష కేంద్రాల్లో 322 మంది విద్యార్థులకు గానూ మొదటి పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని విద్యాధికారి యాదవరెడ్డి తెలిపారు.

● **జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్‌లో బాలికల ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులకు గానూ 219 మంది విద్యార్థులు హాజరు కాగా, బాలుర పాఠశాలలో 205 మందికి 204 మంది, మునిగడప పాఠశాలలో 100 శాతం హాజరైనట్లు ఎంఈవో భాస్కర్‌రెడ్డి తెలిపారు.

● **వర్గల్:** మండల వ్యాప్తంగా 4 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 647 మంది విద్యార్థులకు గాను 646 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాధికారి సునీత తెలిపారు.

● **హుస్నాబాద్:** హుస్నాబాద్‌లో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 100 శాతం విద్యార్థులు హాజరయ్యారు.

● **కొండపాక:** మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో 587 మందికి గాను 100 శాతం విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని కొండపాక ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

● **చేర్యాల:** స్థానిక గురుకులం, పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్, బాలికల జడ్పీఎస్ఎస్, ముస్త్యాల మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు 100 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని చిన్నకోడూరు, ఇబ్రహీంగనర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 365 మంది విద్యార్థులకు గాను 365 మంది పరీక్షకు హాజరయ్యారు.

● **ములుగు:** మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ములుగులో 242, తున్కిబొల్లారం 145, సింగన్నగూడ 192 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా సింగన్నగూడ పాఠశాలలో జరిగిన పరీక్షకు ఇద్దరు గైర్హాజరయ్యారు.

● **దూళిమిట్ట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. మొత్తం 82 మంది విద్యార్థులకు గాను 82 మంది హాజరైనట్లు తెలిపారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలోని బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 284 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

● **మద్దూరు:** మండలంలో 199 మంది విద్యార్థులకు గాను 199 మంది పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కర్ణాకర్‌రెడ్డి తెలిపారు.

● **గజ్వేల్:** పదోతరగతి పరీక్షా కేంద్రాలను గజ్వేల్ ఏసీపీ కే.పురుషోత్తంరెడ్డి పరిశీలించారు. పట్టణంలోని సెయింట్ జోసెఫ్స్ పాఠశాల, బాలికల హబ్‌లోని పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆయన పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు గురించి గజ్వేల్ సీఐ సైదాను అడిగి తెలుసుకున్నారు.



మిరుదొడ్డిలో పరీక్షకు హాజరైన విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



కొండపాక: దుద్దెడలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



వర్గల్: నెంటూర్ జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రం వద్ద క్యూకట్టిన విద్యార్థులు

ఉద్యోగం రాదని.. యువకుడి ఆత్మహత్య



తీగుల్ల రమేష్ మృతదేహం

ధూళిమిట్ట, మార్చి18: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని కూటిగల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన తీగుల్ల రమేష్ గత నెలలో ఆర్మీ సెలక్షన్ కోసం హన్మకొండలోని ఉచిత శిక్షణ శిబిరానికి వెళ్లాడు. మెడికల్ చెకప్‌లో చేతులు వంకరగా ఉన్నాయని తిరస్కరించడంతో తనకు ఆర్మీ ఉద్యోగం మనస్తాపానికి గురై ఈ నెల 16న వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మద్దూర్ ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

● **నూతన వధూవరులకు గాయాలు**



రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

చిన్నకోడూరు, మార్చి 18: కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోవడంతో అందులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లి శివారులో సోమవారం చోటు చేసుకున్నది. కరీంనగర్ జిల్లా ఆరెపల్లి మండలం రేకుర్తికి చెందిన ప్రశాంత్‌కు అక్బర్‌పేట భూంపల్లి మండలం చిన్న నిజాంపేటకు చెందిన అరుణతో ఈ నెల 17న వివాహం జరిగింది. సోమవారం నిజాంపేట నుంచి రేకుర్తికి వెళ్తున్న క్రమంలో చెర్లఅంకిరెడ్డిపల్లి శివారులో కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి కారు ముందుభాగం ధ్వంసమైంది. ఈ ఘటనలో లావణ్య, ఈశ్వరమ్మ, స్పందన, మురళికి తీవ్ర గాయాలు కాగా ప్రశాంత్, అరుణకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కోహెడ 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పందిల్ల రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

హుస్నాబాద్, మార్చి18 : హుస్నాబాద్ మండలం పందిల్లలోని ఓ రైస్ మిల్లులో సోమవారం రాత్రి పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రైస్‌మిల్లులో స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రభాకర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిని సన్మానించిన బీజేపీ నాయకులు

వర్గల్, మార్చి 18 : సిద్దిపేట జిల్లా బీజేవైఎం కార్యదర్శిగా నియామకమైన బబ్బూరి రవీందర్‌ను సోమవారం మండల బీజేపీ నాయకులు వర్గల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్, నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

కుకునూరుపల్లి, మార్చి 18 : మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం గణపతి పూజ, పుణ్యా వచనం, కంకణ ధారణ కార్యక్రమాలతో ఈ తంతు మొదలైంది. అనంతరం పెద్దమ్మతల్లి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

రూ.60 వేల ఎల్వోసీ అందజేత

రామాయంపేట, మార్చి 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అండగా నిలిచారు. ధర్మారం గ్రామానికి చెందిన నక్కని దిలీప్ కుటుంబీకులకు సోమవారం రూ.60వేల ఎల్వోసీని కాంగ్రెస్ నేత ద్వారా అందజేశారు.

షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనాలు సవరించాలి

సంగారెడ్డి రూరల్, మార్చి 18: షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనాలను సవరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం 73షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌కు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి, రెండు నెలల్లోగా సూచనలు, అభ్యంతరాలు పంపాలని కోరిందన్నారు. జిల్లా కమిటీ నుంచి అభ్యంతరాలు, సూచనలు పంపుతున్నామని వాటిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.28,223గా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట సీయూటీ జిల్లా కోశాధికారి రాజయ్య, నాయకులు బాబురావు, ప్రసన్న, దయానంద్ ఉన్నారు.

నేడు అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశం

అల్లాదుర్గం, మార్చి 18: అల్లాదుర్గం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌యాదవ్ సోమవారం తెలిపారు. ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక స్త్రీశక్తి భవన్‌లో నిర్వహించే సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

22 నుంచి మెదక్ జడ్పీస్థాయి సంఘు సమావేశాలు

మెదక్ అర్బన్, మార్చి 18: ఈ నెల 22 నుంచి జడ్పీస్థాయి సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా సమావేశాలకు హాజరుకావలన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దూళిమిట్ట,మార్చి18: దూళిమిట్ట గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీవో రాంమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలనీ ఫీల్డ్ అసిస్టెంట్ బాలకిషన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏంపీవో ఖాజామొహినుద్దీన్, పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్ పాల్గొన్నారు

మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన

బెజ్జంకి, మార్చి 18: మూఢనమ్మకాలు, సైబర్ నేరాల పట్ల పోలీస్ కళాజాత బృందం సభ్యులు మండలంలోని రేగులపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, పేకాట, మద్యం వల్ల కుటుంబంలో జరిగే నష్టాలు. ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు, మోటర్ వాహనాల చట్టం, వరకట్న వేధింపులు, షీటీమ్స్, మత్తు పదార్థాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌రావు, మాజీ సర్పంచ్ ఐలయ్య, పోలీస్ కళా బృందం సభ్యులు బాలు, రాజు, రవీందర్, తిరుమల, సాంస్కృతిక సారథి సభ్యులు శంకర్ బాబు, భాస్కర్ పాల్గొన్నారు.


పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషణ పక్వాడ ప్రతిజ్ఞ చేయిస్తున్న చేర్యాల ఐసీడీఎస్ సీడీపీవో శారద

చేర్యాల, మార్చి 18: పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ చేర్యాల సీడీపీవో శారద అన్నారు. చేర్యాల పట్టణంలోని కురుమవీధి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడ పోషణ పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ టీం సభ్యులు కనకరాజు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు



సిబ్బందితో మాట్లాడుతున్న పుట్ల శ్రీనివాస్

నారాయణరావుపేట, మార్చి 18: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తామని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగరీత్యా వైద్యశాఖలో 20 సంవత్సరాల క్రితం మొదటి ప్రస్థానం నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచే ప్రారంభించానని, పదోన్నతి పొందిన తర్వాత సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కాశీనాథ్, శ్రీనివాస్, బాపురెడ్డి, హెచ్ఈవో జనార్దన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ఎంపీవోపై ఎంపీపీ దాడి చేయడం బాధాకరం

● **ఎంపీడీవో వెంకటరామకృష్ణశర్మ**



బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ములుగు, మార్చి 18: ఎంపీవోపై ఎంపీపీ దాడి చేయడం బాధాకరమని, వెంటనే ఎంపీవోకు క్షమాపణ చెప్పాలని ములుగు ఎంపీడీవో వెంకటరామకృష్ణశర్మ డిమాండ్ చేశారు. సోమవారం ములుగు ఎంపీడీవో కార్యాలయం ఎదుట అధికారులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో ఎంపీవోపై ఎంపీపీ దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో సూపరింటెంట్ రామచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్‌లు నర్సింలు, జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఉద్యోగుల నిరసన

బెజ్జంకి: ఎంపీవోపై ఎంపీపీ దాడి చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మప్ప ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

బస్టాండు ఉన్నా.. బస్సులు రావు

● **పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు**



నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు

చిన్నకోడూరు, మార్చి 18: మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నది. ప్రయాణ ప్రాంగణంలోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు లేక బస్టాండు వెలవెలబోతున్నది. మండల కేంద్రంలో 24 సంవత్సరాల క్రితం ఆర్టీసీ బస్టాండు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. బస్టాండు నిర్వహణలో ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు బస్టాండులోకి రావడం లేదు.

పంచాయతీలకు అడ్డాగా..

బస్టాండు వినియోగంలో లేకపోవడంతో పంచాయతీలకు అడ్డగా మారింది. బస్టాండు ఆవరణలో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకంటున్నారు. అదేవిధంగా కొందరు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. బస్టాండు నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోని బస్టాండును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన జిల్లా స్థాయి రోబోటిక్స్ ఎగ్జిబిషన్

సిద్దిపేట క్రైం, మార్చి 18: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోబోటిక్స్ ఎగ్జిబిషన్ సోమవారం ముగిసింది. జిల్లాస్థాయిలో 38 ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. ఉదయం ప్రిన్సిపాల్ ప్రసాద్ సోహమ్, అకాడమీ డైరెక్టర్ సహదేవులు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. కళాశాల విద్యార్థుల మార్గదర్శకత్వంలో, జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన రోబోటిక్స్ మోడల్స్‌ని ఈఎగ్జిబిషన్లో ప్రదర్శించారు. ఇందూర్ కళాశాలకు చెందిన మెకానికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల అధిపతులు పోచయ్య, మల్లేశంలు న్యాయ నిర్ణేతలుగా మూడు ఉత్తమ మోడల్స్‌ని ఎంపిక చేశారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై, ఇటువంటి వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించిన భౌతికశాస్త్ర విభాగ అధ్యాపక బృందాన్ని, కార్యక్రమ సమన్వయకర్త సీహెచ్.మధుసూదన్‌ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గత రెండు సంవత్సరాలుగా రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇంటర్ షిప్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం జిల్లా రోబోటిక్స్ ఎగ్జిబిషన్లో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎన్నికైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎన్సాన్‌పల్లి జడ్పీహెచ్ఎస్, ఇంద్రనగర్ జడ్పీహెచ్ఎస్, తడకపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, పరీక్షల విభాగం సమన్వయకర్త గోపాల సుదర్శనం, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, భౌతికశాస్త్ర విభాగ అధ్యాపకులు ఎ.మహేష్, భైరయ్య, కృష్ణయ్య, సౌమ్య, పాల్గొన్నారు.



రోబోటిక్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

నేటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు

రాయపోల్, మార్చి 18: మండలంలోని వడ్డెపల్లిలో నేటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల కోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఆలయ ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, పుణ్యా వచనం, అంకురారోపణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి ఉమామహేశ్వరుల కల్యాణం వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమం అనంతరం స్వామి వారి రథోత్సవం జరగనున్నది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహకులు తెలిపారు.

ఆశీర్వదిస్తే జహీరాబాద్‌ను అభివృద్ధి చేస్తా

పెద్దశంకరంపేట, మార్చి 18: ప్రజలు ఆశీర్వదించి తనను జహీరాబాద్ ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని ఆరేపల్లిలో నిర్వహించిన బీరప్ప ఆలయ జాతరలో పాల్గొన్నారు. అనంతరం పెద్దశంకరంపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎంపీగా పని చేసిన బీబీపాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తాను గెలిస్తే యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు రైతులకు సాగునీరు అందించేందుకు పని చేస్తానని పేర్కొన్నారు. ఆయనవెంట ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు, వైస్ ఎంపీపీ లక్ష్మిరమేష్, ఎంపీటీసీలు దత్తు, స్వప్న రాజేశ్వర్, మాజీ సర్పంచులు, నాయకులు ఉన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మిరుదొడ్డి, మార్చి18: రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు, కుర్మలకు వేరువేరుగా కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని తెలంగాణ కుర్మసంఘం రాష్ట్ర కార్యదర్శి బల్లే వెంకటేశం డిమాండ్ చేశారు. సోమవారం అక్బర్‌పేట చౌరస్తాలో ఆయన మాట్లాడారు. తమకు వేరువేరుగా కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మార్చి 18: ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు ప్రజావాణికీ వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు.

కిష్టాపూర్ కాలువకు నీటిని విడుదల చేయాలి

రాయపోల్, మార్చి 18: కిష్టాపూర్ కాలువ ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేయాలని వివిధ గ్రామాల రైతులు సోమవారం వీరానగర్‌శివారులో రామాయంపేట కాలువ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రామాయంపేట కాలువ నుంచి కిష్టాపూర్ కాలువకు నీటిని విడుదల చేసేందుకు వీలుగా, కిష్టాపూర్ కాలువలో సుమారు మూడు కిలోమీటర్ల మేర పూడిక తీయాలని అధికారులు చెప్పడంతో, ఆయా గ్రామాల రైతులు రూ. 6లక్షల ఖర్చు చేసి మరమ్మతులు చేయించామన్నారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత అధికారులు నీటిని విడుదల చేయడంలేదని ఆరోపించారు. నీటిని విడుదల చేయకపోవడం వల్ల కిష్టాపూర్, గుంద్రెడ్డిపల్లి, మల్కాపూర్, కోనాయపల్లి, పీటీ వీరారెడ్డిపల్లి, వడ్డెపల్లి, దొడ్డపల్లి గ్రామాల రైతులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. వేల ఎకరాల పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులకు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి కిష్టాపూర్ కాలువకు నీటిని విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న రైతులు

పుస్తెలతాడు అపహరించిన నిందితుడి అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

దుబ్బాక,మార్చి18: మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో ఈనెల 14న ఏల్లమ్మదేవాలయ సమీపంలో మహిళ నుంచి గుర్తుతెలియని వ్యకి పుస్తెలతాడును అపహరించాడు. సోమవారం ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. ముస్త్రాగ్రామానికి చెందిన మ్యాన లావణకుమార్ ఈనెల 14న ఎనగుర్తి గ్రామశివారులో కల్లు అమ్ముకుంటున్న కోయాడ యాదమ్మ పుస్తెలతాడును అపహరించుకుపోయాడు. దీంతో భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనాలు ఎలా చేయాలో యూట్యూబ్‌లో చూసి ఈ అపహరణకు పాల్పడిన నిందితుడిని సాంకేతిక విధానాన్ని ఉపయోగించి గుర్తించామన్నారు. అతని నుంచి బంగారాన్ని రికవరి చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడానికి చాకచక్యంగా వ్యవహరించిన దుబ్బాక ఎస్ఐ గంగరాజు, మిరుదొడ్డి ఎస్ఐ పర్శరాములు, క్రైమ్‌పార్టీ సిబ్బంది సాయికృష్ణ, రాజిరెడ్డి, రాంజీలను అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● **బీజేపీ వర్గల్ మండల అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్**

వర్గల్, మార్చి 18 : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ వర్గల్ మండల అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలలో అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్, యాదగిరితో పాటు తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అజార్



అజార్ హుస్సేన్

మద్దూరు, మార్చి 18: జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు మద్దూరు మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అజార్ హుస్సేన్ ఎన్నికయ్యాడు. ఇటీవల ఇండియన్ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్, తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. దీంతో ఈ నెల 23 నుంచి 27 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల విజయ్‌బాబు తెలిపారు. అజార్ హుస్సేన్ ఎంపిక పట్ల సిద్దిపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కందుకూరి ఉపేందర్, దామెర మల్లేశం, పీడీ ప్రేమ్‌కుమార్, మహమ్మద్ ఇంతియాజ్ హుస్సేన్ అభినందించారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాల పట్టివేత



గూడెం శివారులో అక్రమంగా ఇసుకకు తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

బెజ్జంకి/కుకునూరుపల్లి మార్చి 18: మండలంలోని బేగంపేట, గూడెం గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను డంపు చేసి డంపు నుంచి ఇసుకను తరలిస్తున్న మినీ టిప్పర్, ఎక్స్‌కవేటర్ వాహనాలను సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. వాహనాలను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కృష్ణారెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ముద్దాపూర్ కాలువ వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒక టిప్పర్, ఎక్స్‌కవేటర్‌ను ఆర్ఐ సత్యనారాయణ, పోలీసుల సహాయంతో పట్టుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో మల్లికార్జున్‌రెడ్డి హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళులు

హుస్నాబాద్, మార్చి 18 : మాజీ ఎమ్మెల్యే దివంగత బొమ్మ వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు వల్లపు రాజు, సది, సరోజన, బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కు శ్రీనివాస్, ఎండీ హసన్, కిసాన్ సంఘ్ జిల్లా నాయకుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు కోమటి సత్యనారాయణ, దళిత జేఏసీ నాయకుడు బత్తుల చంద్రమౌళి, సీపీఐ నాయకులు మాడిశెట్టి శ్రీధర్, పెరుమాండ్ల నర్సాగౌడ్, కుమార్, పూదరి శ్రీనివాస్, కిష్టస్వామి, కైలునాయక్ తదితరులున్నారు.